

నూతన జంటకు కానుక అందజేస్తున్న ఎంపీ లక్ష్మణ్

వైదేహి ఆశ్రమంలో ఆదర్శ వివాహం

సైదాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ సరస్వతీనగర్‌లోని వైదేహి అనాథ ఆశ్రమ యువతి అనూష వివాహం రాజేందర్‌రెడ్డితో ఆదివారం జరిగింది. భాగవతి లలిత, శ్రీనివాసరావు దంపతులు కన్యాదాతలుగా పెళ్లితంతు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వనవాసి సంఘటనా మంత్రి రామచంద్రయ్య, దక్షిణ, మధ్యక్షేత్ర ఆవాసాల ప్రముఖ్ రామాచారి, వ్యవస్థా ప్రముఖ్ తిరుమలజీ, సంఘ కార్యకర్తలు, సేవికాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉపవిద్యాశాఖాధికారి విజయలక్ష్మిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం.. ఆనంద సమయం

● 55 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

సైదాబాద్ : మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1968-1969 బ్యాచ్ విద్యార్థులు గురువులతో కలిసి సందడి చేశారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన 40 మంది పూర్వ విద్యార్థులందరూ 55 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు కాంపాస్ బాక్సులు, పెన్నులు, పరీక్షా ప్యాడ్‌లు, మరో 40 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మితో పాటు, ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 14, 24 వార్డులలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన పనులను కాంట్రాక్టర్ వెంటనే పూర్తిచేయాలని కోరారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ హరిత, కమిషనర్ అమరేందర్‌రెడ్డితో పాటు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డికి తట్టిఅన్నారం వాసుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం పరిధి కాలనీల్లోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆదివారం కలిసి కోరారు. డ్రైనేజీ ఔట్ లైన్ లేకపోవడంతో చాలా ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. సుమారు 12 కాలనీల ప్రజలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరాచారి, మధు, ఫణిరెడ్డి, మానయ్య, శంకర్, వీరారెడ్డి, సీతారామ్‌రెడ్డి, లక్ష్మణ్‌చారి, రవి పాల్గొన్నారు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి : రాగుల

వనస్థలిపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పార్కులో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వెనుకాల ఉన్న హెచ్ఎండీఏ పార్కులో ఆదివారం కార్పొరేటర్ పర్యటించి వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి 60లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిమ్ముల ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలు'

హయత్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి. యాదయ్య అన్నారు. ఆదివారం రాగన్నగూడలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారి వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 19న తుర్కయంజాల్ మున్సిపాలిటీ సీపీఎం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కిషన్, భాస్కర్, శ్రీరామ్మూర్తి, అరుణ్‌కుమార్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించడం హర్షణీయం

ఎల్‌బీనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. పాశంను సన్మానించిన వారిలో సభ్యులు గోర శ్యాంసుందర్‌గౌడ్, మారోజు రామాచారి, హరతి రూడా ఉన్నారు.

వరల్డ్ క్యారమ్స్ చాంపియన్ ఆదిత్యకు సన్మానం



ఆదిత్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలుపుతున్న భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యారమ్‌బోర్డు పోటీల్లో మూడో స్థానం సాధించిన ఆదిత్యను దేప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆర్కేపురంలోని తన నివాసంలో కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆదిత్యను శాలువాతో సన్మానించి అభినందించడంతో పాటు దేప ఫౌండేషన్ ద్వారా ప్రకటించిన రూ.25వేలకు సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పున్న గణేష్ నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, దేప మల్లారెడ్డి, కెఎన్ మూర్తి, శ్రీశైలం, రాజగోపాల్, విష్ణవరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్ టెస్ట్‌కు అనూహ్య స్పందన

చంపాపేట : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని అల్ఫోర్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. హైదరాబాద్ జిల్లా కేంద్రంగా నిర్వహించిన ఈ పరీక్షలకు 1827 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 22న బహుమతులు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో హరిజన బస్తీ

● కూలడానికి సిద్ధంగా కమ్యూనిటీహాల్ ● పాలకులకు పట్టని బస్తీ అభివృద్ధి



చంపాపేటలోని హరిజనబస్తీలో కూలడానికి సిద్ధంగా ఉన్న నవజీవన జ్యోతి సంఘం కమ్యూనిటీహాల్

చంపాపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇరువై సంవత్సరాల నుంచి ఆ బస్తీ అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో సమస్యలు పెరుగుతున్నాయి. చంపాపేట డివిజన్‌లోని హరిజనబస్తీలో సుమారు 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. చంపాపేట గ్రామపంచాయతీ ఉన్న సమయంలో ఏర్పడిన బస్తీ అనంతరం జీహెచ్ఎంసీలో కలిసిపోయింది. చంపాపేట డివిజన్‌గా ఏర్పడిన తర్వాత బస్తీ బాగోగులు పట్టించుకునేవారు కరువైనారు. 20 సంవత్సరాల కిందట అప్పటి కౌన్సిలర్ తోకటి కిషన్ బస్తీలో నవజీవనజ్యోతి సంఘంకు రూ.30 వేలతో కమ్యూనిటీహాల్ నిర్మించారు. అనంతరం నాటి నుంచి నేటి వరకు బస్తీలో జీహెచ్ఎంసీ నిధులతో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేటి పాలకులకు బస్తీ అభివృద్ధి చేయడంలో దృష్టి సారించడం లేదని బస్తీవాసులు చర్చించుకుంటున్నారు. ఓట్ల కోసం వచ్చి వంగివంగి దండాలు పెడుతారే తప్పా అనంతరం బస్తీ బాగోగులు మరిచిపోతున్నారని వారు ఆరోపిస్తున్నారు.



కమ్యూనిటీహాల్ ఆవరణలో పనిచేయని చేతిపంపు

కూలడానికి సిద్ధంగా కమ్యూనిటీహాల్..

హరిజనబస్తీలో నవజీవనజ్యోతి సంఘం భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే నీరంతా గదుల్లోకి చేరుతుంది. స్లాబ్ పూర్తిగా లీకేజీమయంగా మారింది. బస్తీవాసులకు భవనం వినియోగం లేకుండా పోయింది. బస్తీలో నవజీవనజ్యోతి సంఘంకు నూతన కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా నేటికి ఫలితం దక్కలేదని వారు వాపోయారు. బస్తీలో నేటికి కొత్తగా సీసీ రోడ్లు, యూజీడీ, వాటర్ లైన్ల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది వీధులను శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు బస్తీవాసులు పేర్కొన్నారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన తోకటి కిరణ్ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే ప్రస్తుతం కనిపిస్తుందని వారు పేర్కొన్నారు. బస్తీలో కేవలం రెండు విద్యుత్ స్తంభాలు, కమ్యూనిటీహాల్ వద్ద హైమాస్టులైట్లు వేసినట్లు వారు పేర్కొన్నారు. బస్తీలోని ప్రభుత్వ యునాని వైద్యశాల పక్కన 80 గజాల స్థలం ఉందని, అక్కడ మహిళల కోసం కమ్యూనిటీహాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలనీ బాగోగులు పట్టించుకోవడం లేదు



ప్రజాప్రతినిధులు హరిజనబస్తీ బాగోగులు పట్టించుకోవడం లేదు. నవజీవన జ్యోతి సంఘం భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. కొత్త భవనం కోసం నిధులు మంజూరు చేయాలని కోరినా ఫలితం శూన్యం.

- సీహెచ్.బాల్‌రాజ్, స్థానికుడు, హరిజనబస్తీ

సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణాలు చేపట్టలేదు



బస్తీలో కొత్తగా ఎటువంటి సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణాలు చేపట్టలేదు. కొత్తగా వాటర్‌లైన్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రజాప్రతినిధులు బస్తీ బాగోగుల గురించి పట్టించుకోవడం లేదు.

- దుర్గాప్రసాద్, స్థానికుడు, హరిజనబస్తీ

ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదు



చంపాపేటలోని హరిజనబస్తీలో సీసీ రోడ్లు, యూజీడీ, కమ్యూనిటీ భవనాల నిర్మాణాల కోసం ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదు. బస్తీలో సమస్యలు గుర్తించి ప్రజాప్రతినిధుల సహకారంతో కొత్తగా పనులు చేపట్టేందుకు ముందుకు వెళ్తాం.

- సురేష్, ఏఈ, జీహెచ్ఎంసీ, చంపాపేట డివిజన్

హిందూ ధర్మరక్షణకు యువత నడుంబిగించాలి

● కాశ్మీర్ ఫైల్స్ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్



త్రిశూల్ దీక్ష ప్రతిజ్ఞ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కాశ్మీర్‌ఫైల్స్ సినిమా నిర్మాత అభిషేక్ అగర్వాల్

ఎల్‌బీనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మరక్షణ కోసం యువత నడుంబిగించాలని కాశ్మీర్ ఫైల్స్ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్ పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్ష కార్యక్రమాన్ని ఆదివారం సరూర్‌నగర్ మండల మైదానంలో నిర్వహించారు. అంతకుముందు సరూర్‌నగర్ మండల మైదానం నుంచి బజరంగ్‌దళ్ కార్యకర్తల పదసంచాలన్ ప్రారంభమై మహాలక్ష్మి ఆలయం చౌరస్తా మీదుగా గాంధీబొమ్మ, సరూర్‌నగర్ చౌడీ మీదుగా సరూర్‌నగర్ మండల మైదానం వరకు సాగింది. అనంతరం జరిగిన సభలో అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కాదు మన హిందూ ధర్మ రక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలలో దేశంలో మెజారిటీగా ఉన్న హిందువుల జనాభ తగ్గుతూ వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 25 సంవత్సరాలలో హిందువులు మైనారిటీలుగా మారే ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ మాట్లాడుతూ మొఘలులను తరిమికొట్టి దేశంలో భగవధ్వజాన్ని రెపరెలాడేలా చేసినటువంటి చరిత్ర మనకు ఆదర్శం కావాలన్నారు. భారతదేశం, సనాతన ధర్మం ఏ సవాళ్లను ఎదుర్కుంటుందో వాటికి పరిష్కారం చూపెట్టాల్సినటువంటి గురుతర బాధ్యత మనపై ఉందన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో అక్రమంగా తిష్టవేసిన బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెతికి పట్టుకుని తిప్పిపంపాలని పోలీసులను కోరారు. అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్న దేశద్రోహులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సభలో బజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ శివరాములు, విశ్వహిందూ పరిషత్ భాగ్యలక్ష్మి విభాగ్ ప్రముఖ్ కళ్లెం రాజేందర్‌రెడ్డి, సంఘటన మంత్రి సాయిరాంజీ, వివేకానంద జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ నవారు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు మెట్రో బాలాపూర్ మీదుగా నిర్మించండి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శంకర్‌రెడ్డి వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు

సరూర్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించతలపెట్టిన మెట్రోరైల్ లైన్‌ను మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తా మీదుగా చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఆదివారం ఆయన మీర్‌పేట్ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి కిషన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎయిర్‌పోర్టు మెట్రో లైన్‌ను ఎల్బీనగర్ నుంచి మంద మల్లమ్మచౌరస్తా, ఆర్‌సీఐ రోడ్డు, బాలాపూర్ చౌరస్తా, శివాజీచౌక్, బాలాపూర్, మల్లాపూర్, పహాడీషరీఫ్ తదితర ప్రాంతాల మీదుగా నిర్మించాలని ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలోని ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయని, అక్కడి జనాభా సైతం అదే స్థాయిలో పెరుగుతున్నదని ఆయన మంత్రికి వివరించారు. రవాణాపరంగా మెట్రో రైలు సౌకర్యవంతంగా ఉన్నందున ఇక్కడి ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో రైల్ లైన్‌ను ఆయా ప్రాంతాల మీదుగా చేపట్టాలని శంకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు కీసరి గోవర్ధన్‌రెడ్డి, ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్, పసునూరి భిక్షపతిచారి, కె.గౌరీశంకర్, బీజేపీ నాయకులు గాజుల మధు, సోమేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవం



నాదర్‌గుల్‌లోని శివాలయంలో ఇరుముడి మహోత్సవంలో మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించి శబరిమలకు బయలుదేరే స్వాముల ఇరుముడిధారణ మహోత్సవం ఆదివారం నాదర్‌గుల్‌లోని శివాలయంలో, వీరభద్రస్వామి సన్నిదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గురుస్వాములు హాజరై మండల దీక్షలు పూర్తి చేసుకున్న అయ్యప్పలకు ఇరుముడి కట్టారు. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, అయ్యప్పలు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

ఎల్‌బీనగర్ : లింగోజీగూడ డివిజన్ బృందావన్ కాలనీలో శబరిమల అయ్యప్పస్వామి మహాపడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన సతీష్‌గౌడ్, మిర్చి టింకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములు దరిపల్లిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శివగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్‌రావు, అఖిల్‌గౌడ్, రమాకాంత్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని శివాలయం వద్ద గురుస్వామి పల్లె మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అంజన్‌గౌడ్ అయ్యప్ప స్వామి మహాపడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో శివాలయ ప్రాంతం మార్మోగింది. పూజా కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, దేవిడి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల గోపాల్‌గౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం : నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీ కమ్యూనిటీహాల్ ప్రహరీ, సీసీబెడ్ నిర్మించాలని, వరదనీరు పోవడానికి ట్రంక్‌లైన్ నిర్మించాలని, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణ, రాంబాబు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ విధానం యోగా

కొత్తపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ ఆరోగ్య సంరక్షణ విధానం యోగా అని భారతీయ యోగా సంస్థాన్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు బీ.వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రజయ్‌నివాస్ -1 పార్కులో ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు కృష్ణయ్య మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతికి యోగాభ్యాసమే చక్కటి మార్గమన్నారు. అనంతరం కొంత సేపు అందరూ యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సంస్థాన్ జిల్లా కార్యదర్శి జగన్‌రెడ్డి, జోనల్ చీఫ్ వీ.మధు, కాలనీ ప్రతినిధులు సురేష్, లింగేష్, ఫణీంద్ర, సృజన పాల్గొన్నారు.

జీవశాస్త్రంపై విజ్ఞానం కలిగిఉండాలి

మన్సూరాబాద్ : ప్రస్తుత సమాజంలో ప్రతి విద్యార్థి జీవశాస్త్రంపై కనీస విజ్ఞానం కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలంగాణ జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రంగారెడ్డి జిల్లా సమావేశాన్ని ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించి ఫోరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా లేమూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన వై.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా చిన్నగోల్కొండ జడ్పీహెచ్ ఎస్‌కు చెందిన రావుల రాజమల్లయ్య, ప్రధానకార్యదర్శిగా వి.ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా ఎన్.మాణిక్యం, ఉపాధ్యక్షులుగా ఎం.రవీందర్‌రెడ్డి, ఎన్.రమాదేవి, ఎన్.దామోదర్, కార్యదర్శులుగా హవీలా, వి.సీతారాం, కె.అనిల్‌కుమార్, ఎండీ అక్బర్, ప్రింట్ మీడియా కన్వీనర్‌గా మైలార్‌దేవులపల్లికి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఏవీ సుధాకర్‌తో పాటు సభ్యులుగా పలువురిని నియమించారు. జిల్లాలోని 27 మండలాలకు ఇన్‌చార్జిలను ఎన్నుకున్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి

చంపాపేట : హస్తినాపురం డివిజన్ అగ్రికల్చర్‌కాలనీలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోషియేషన్ అధ్యక్షుడిగా వి.సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరివర్ధన్, కోశాధికారిగా ఎస్.అల్వాల్‌రెడ్డితో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సీనియర్ సభ్యులు దామోదర్‌రెడ్డి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పీఆర్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన నిందితుడి అరెస్టు

కొత్తపేట : ఎల్బీనగర్ పీఎస్ పరిధి మన్సూరాబాద్‌లో 13 సంవత్సరాల బాలికను వేధించిన కేసులో ఆదివారం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిసిన వివరాలు ప్రకారం.. ఖమ్మం జిల్లా పోలేపల్లి సాయికృష్ణనగర్‌కు చెందిన యలమల్ల సతీష్(34) మన్సూరాబాద్‌లో సోదరి వద్ద ఉండేవాడు. బాలికను వెంబడిస్తూ వేధించడం, బాలిక తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఇబ్బందికరంగా మాట్లాడేవాడు. రాత్రివేళల్లో బాలిక పేరును అతడు గట్టిగా అంటూ, వారి ఇంటికి వెళ్లి తలుపులపై బాదుతూ భయభ్రాంతులకు గురిచేసేవాడు. బాధితుల ఫిర్యాదుతో అక్టోబరులో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలిసి అతడు దుబాయిలో ఉండేమరో సోదరి వద్దకు పారిపోయాడు. వారం రోజుల క్రితం అతడు మన్సూరాబాద్‌కు వచ్చాడని తెలిసిన పోలీసులు ఆదివారం ఉదయం 11 గంటలకు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించడంతో అతడిని రిమాండుకు తరలించారు.

మొదటి రోజు గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం



అబ్దుల్లాపూర్‌మెట్ బ్రిలియంట్ కళాశాల గ్రూప్-2 పరీక్ష సెంటర్ వద్ద అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తదితరులు

హయత్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు ఆది వారం ప్రశాంతంగా జరిగాయి. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 8 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. పరీక్షలు ఉదయం 10గంటలకు ఉండడంతో అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు ఉదయం 8గంటలకే చేరుకున్నారు. అభ్యర్థులను ఎనిమిది గంటల నుంచే పరీక్ష హాల్‌లోనికి అనుమతించారు. 9.30గంటల తర్వాత గేట్లు మూసి వేశారు. ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చి నా అనుమతించలేదు. జీ-స్కూల్ సెంటర్ వద్ద ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. రెండో సెషన్‌లో కూడా 2.30 గంటల కే పరీక్ష సెంటర్ల గేట్లు మూసివేశారు. హయత్‌నగర్ వరుణ్‌మోడల్ పాఠశాల సెంటర్‌లో 291మంది అభ్యర్థులకు గాను 148మంది, పల్లవి ఇంజనీరింగ్ కళాశాల మొదటి సెంటర్‌లో 672మంది అభ్యర్థులకు 307మంది అభ్యర్థులు, పల్లవి ఇంజనీరింగ్ కళాశాల రెండవ సెంటర్‌లో 624మంది అభ్యర్థులకు గాను 282మంది, జీ- స్కూల్ సెంటర్‌లో 528మంది అభ్యర్థులకు గాను 248 మంది అభ్యర్థులు, శాంతినికేతన్ సెంటర్‌లో 360మంది అభ్యర్థులకు గాను 171మంది అభ్యర్థులు, హయత్‌నగర్ శ్రీచైతన్య సెంటర్‌లో 504 మంది అభ్యర్థులకు గాను 229 మంది అభ్యర్థులు, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయకాలేజీ ఆఫ్ ఫార్మసీ సెంటర్‌లో 672 మంది అభ్యర్థులకు గాను 320మంది అభ్యర్థులు మాత్రమే హాజరైనారు.



హయత్‌నగర్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న అధికారులు

మలక్‌పేటలో..

చాదర్‌ఘాట్ : గ్రూప్-2 పరీక్షలు ఆదివారం మలక్‌పేటలోని 12 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. దిల్‌సుఖ్‌నగర్‌లోని న్యూ నోబుల్ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన మహబూబ్‌నగర్ నివాసి సురేష్, అచ్చంపేట నివాసి అరుణ, ప్రశాంత్ తోపాటు మరో ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వెనుతిరిగారు. వీరిలో సురేష్ పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలంటూ చేసిన విజ్ఞప్తులను అధికారులు పట్టించుకోలేదు. మలకపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 11 పరీక్షా కేంద్రాలు, చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఈ 12 పరీక్షా కేంద్రాల్లో 5,875 మంది అభ్యర్థులకు గాను కేవలం 1703 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలు రాశారు. 4,172 మంది అభ్యర్థులు గైర్హాజర్ అయినట్లు అధికారిక లెక్కలు ధ్రువీకరించాయి. మలకపేట ఏసీపీ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ పి.నరేష్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మధు బందోబస్తు నిర్వహించారు.



ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో అక్కడి నుంచి పంపించేస్తున్న మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 12 సెంటర్లలో గ్రూప్ -2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి సెషన్‌లో 8,136 మంది అభ్యర్థులకు 3,557 మంది హాజరుకాగా, 4,579 మంది గైర్హాజరయ్యారు. సెకండ్ సెషన్‌లో 8,136 మందికి గాను 3,530 మంది హాజరుకాగా, 4,606 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లలో మొత్తం 16,272 మందికి గాను 7,087 మంది హాజరు కాగా, 9,185 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష సెంటర్ల వద్ద అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, మాధవ్ పాల్గొన్నారు.

సైదాబాద్, ఐఎస్ సదన్ పరిధిలో..

సైదాబాద్ : సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సెషన్‌లో 504మంది అభ్యర్థులకు 148మంది హాజరుకాగా, 356 మంది గైర్హాజరయ్యారు. సెకండ్ సెషన్‌లో 359 గైర్హాజరయ్యారు. ఐఎస్‌సదన్ పీఎస్ పరిధిలోని సాధన డిగ్రీ కళాశాలలో మొదటి, రెండు సెషన్లలో 336 మంది అభ్యర్థులకు 101మంది హాజరుకాగా 235 మంది గైర్హాజరయ్యారు. కేవీ రంగారెడ్డి డిగ్రీ కళాశాలలో మొదటి, రెండు సెషన్లలో 696 మంది అభ్యర్థులకు 209మంది హాజరుకాగా, 235 మంది గైర్హాజరయ్యారు.